అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

పులిచెర్ల(కల్లూరు): దేశంకోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కల్లూరు హైస్కూల్ హెచ్ఎం శ్రీవాణి కీర్తించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం లభించి 76 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుల స్మారకార్థం నిర్వహిస్తున్న మేరీ మిట్టీ–మేరాభారత్ కార్యక్రమాన్ని సోమవారం విద్యార్థులతో ఘనంగా నిర్వహించారు. దేశరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. వెంకట సిద్దులు, రాజేంద్ర, విమల, ఈశ్వరయ్య, రాజశేఖర్, స్నేహ మాలిని తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: ప్రతి ఒక్కరూ దేశ భక్తి కలిగి ఉండాలని ఎంపీడీఓ రాజేంద్ర అన్నారు. సోమవారం రొంపిచెర్లలో స్థానిక బాలుర, బాలికల, ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థులు దేశ నాయకుల చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు. రొంపిచెర్ల సర్కిల్‌లో ఎంపీడీఓ, ఎంఈఓ శ్రీనివాసులు మాట్లాడారు. ఎందరో త్యాగధనులు దేశం కోసం ప్రాణాలు అర్పించారని స్మరించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే దేశభక్తి భావాలతో ముందుకుపోవాలన్నారు. దేశ రక్షణలో తరించాలన్నారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి, లోకనాథరెడ్డి, కృష్ణయ్య, ఫిజికల్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు బాలబాలికలు పాల్గొన్నారు.


రొంపిచెర్ల సర్కిల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు

పథకాలతో ఆర్థిక స్వావలంబన

- చిత్తూరు డీఆర్‌డీఏ పీడీ తులసి

పెద్దపంజాణి: స్వయం సహాయక సంఘ సభ్యులు తమ జీవనోపాధిని మెరుగు పరుచుకునేందుకు ప్రత్యేక విజన్ ఉండాలని పీడీ తులసి అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో విజన్ బిల్డింగ్‌పై ఈసీ సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్‌హెచ్‌జీలు ఏర్పాటై సుమారు 20 ఏళ్లు దాటిందని, అయితే గ్రూపు సభ్యులు ఇప్పటికీ చిన్న చిన్న రుణాలకే పరిమితమవుతున్నారన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంఘ సభ్యుల జీవనోపాధిని పెంపొందించేందుకు పలు పథకాలను అమలు చేస్తున్నాయని, వీటిని సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తద్వారా ఆర్థిక స్వావలంబన దిశగా పయనించడానికి అవకాశం ఉంటుందన్నారు. అలాగే అర్హత కలిగిన సంఘ సభ్యులు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగవచ్చన్నారు. అయితే సంఘ సభ్యులకు వీటిపై సంపూర్ణ అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో డీపీఎం వెంకటేష్, ఏపీఎం క్రిష్ణప్ప, సంఘమిత్రలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చిత్తూరు డీఆర్‌డీఏ పీడీ తులసి

'పుంగమ్మ'కు జలకళ

పుంగనూరు: పట్టణంలోని పుంగమ్మ చెరువుకు నీటి ప్రవాహం మొదలైంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రామసముద్రం మండలం, కర్ణాటక ప్రాంతాల నుంచి వరదనీరు రావడంతో పుంగమ్మ చెరువుకు చేరుతోంది. నాలుగేళ్ల నుంచి ఈ చెరువు జలకళతో తొణికిసలాడుతోంది. ప్రస్తుతం వరదనీరు రావడంతో చూసేందుకు ప్రజలు తండోపతండాలుగా వెళ్తున్నారు.


వరదనీటితో నిండుతున్న పుంగమ్మ చెరువు

వర్షాలపై అప్రమత్తం

పుంగనూరు: ఇటీవల కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాలుగు రోజుల నుంచి అధికంగా వర్షాలు కురుస్తున్నాయని, పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. పుంగమ్మ చెరువు కూడా వరదనీరు చేరుతోందని, ఒకవేళ ఏ సమయంలోనైనా వరద ప్రమాదం తలెత్తితే తమ దృష్టికి తేవాలన్నారు.

98.6 మిల్లీల వర్షపాతం

చౌడేపల్లె: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి అత్యధికంగా 98.6 మిల్లీల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ మాధవరాజు సోమవారం చెప్పారు. చెరువులు, కుంటల్లోకి భారీగా వర్షపు నీరు చేరడంతో జల కళ సంతరించుకున్నాయి. నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు పంటల సాగుకు సన్నద్ధులయ్యారు.

క్లుప్తంగా

ప్రతి కుటుంబానికీ 'ఉపాధి'

రొంపిచెర్ల: మండలంలో ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. ఎంపీడీఓ రాజేంద్ర, ఏపీఓ బాల మురళి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

భూహక్కు పత్రాల పంపిణీ

సదుం: మండలంలోని మారుతివారిపల్లెలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద 130మంది రైతులకు భూహక్కు పత్రాలను సోమవారం పంపిణీ చేశారు. జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ..భూసమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో పురుషోత్తం, రమణారెడ్డి, జనార్ధనరెడ్డి పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

పులిచెర్ల(కల్లూరు): రైతులు తాము సాగుచేసిన పంటలను విధిగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని పుంగనూరు ఏడీఏ శివకుమార్ కోరారు. సోమవారం ఆయన మండలంలోని కల్లూరు, పులిచెర్ల, దేవళంపేట ఆర్బీకేల పరిధిలో సాగు చేసిన పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఏదేని ప్రకృతి విపత్తుల వల్ల పంటలు నష్టపోతే ఈ–క్రాప్ నమోదు వల్ల ప్రభుత్వం నుంచి పరిహారం పొందవచ్చని అవగాహన కల్పించారు. అనంతరం సాగు నమోదుకు సంబంధించి రికార్డులను చూశారు. మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

చేపలకోసం వెళ్లి చెరువులో పడి వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చౌడేపల్లె: చేపలు పట్టేందుకు వెళ్లి మృతి చెందిన సంఘటన పుదిపట్ల పంచాయతీ తిరుమణపల్లె చెరువులో చోటుచేసుకొంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలాఉన్నాయి. గ్రామానికి చెందిన లక్ష్మయ్య కుమారుడు వెంకట్రమణ (35) సోమవారం చేపలు పట్టేందుకు తిరుమణపల్లె చెరువు వద్దకెళ్లాడు. అతనికి ముందే మూర్ఛ వ్యాధితో బాధపడుతుండేవాడు. చేపలు పట్టేక్రమంలో మూర్ఛరావడంతో నీటిలోనే పడి మృతి చెందాడు. గుర్తించిన పశువుల కాపురులు పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి ఎస్ఐ రవికుమార్ చేరుకొని సంఘటన తీరుపై ఆరా తీశారు. మృతుడి కుటుంబీకులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సమస్యపై అప్పటికప్పుడే 'స్పందన'

పలమనేరు: మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'స్పందన'లో ఏడో వార్డుకు సంబంధించిన దారి సమస్యపై ఫిర్యాదు అందింది. చైర్‌పర్సన్ ఆదేశాలతో గంట వ్యవధిలోనే సంబంధిత అధికారులు దీన్ని పరిష్కరించారు. అలాగే స్థానిక ప్రధాన రహదారిలో రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు అర్జీలు ఇచ్చారు. దీనిపై సంబంధిత శాఖలతో చర్చించి పరిష్కరించాలని కమిషనర్ కిరణ్‌కుమార్‌కు సూచించారు. మరో పదికిపైగా వ్యక్తిగత సమస్యలపై స్థానికులు అర్జీలు ఇచ్చారు.


సమస్యలు వింటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర

'అశ్లీలం'పై ఐద్వా నిరసన

పలమనేరు: రోజు రోజుకూ మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్న నేపథ్యంలో అశ్లీలతతో ఉంటున్న టీవీ సీరియళ్లు, ఇంటర్‌నెట్ ప్రోగ్రామ్‌లను ప్రభుత్వం నిషేధించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద ఐద్వా నాయకురాళ్లు ఆందోళన చేశారు. ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి మాట్లాడుతూ, ఒకప్పుడు పిల్లలు, యువతకు వేటినైతే దూరంగా ఉంచాలనుకున్నామో అవి ఇప్పుడు వివిధ రూపాల్లో చేరువై, వారిని చెడగొడుతున్నాయన్నారు. స్మార్ట్‌ఫోన్లు వచ్చాక పెడదోవ పట్టించే వెబ్‌సైట్లు, వివిధ కంటెంట్ తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. సాధారణ వీడియోలు, ప్రకటనలు అశ్లీలతతో ఉంటున్నాయని, ఇవి కూడా క్రైం రేటు పెరగడానికి ఒక కారణమవుతున్నాయన్నారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు ఇంద్రావతి, జయంతి, ఖైరున్నీసా, నిర్మల పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో గృహాలు

సోమల: జగనన్న ఇళ్ల లబ్ధిదారులు నాణ్యతా ప్రమాణాలతో గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని రాయలసీమ జోన్ క్వాలిటీ కంట్రోల్(థర్డ్ పార్టీ) ఆఫీసర్ కరీముల్లా, హౌసింగ్ డీఈ మధుసూదన్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంతోపాటు నంజంపేట, దిడ్డివారిపల్లె సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు సొంత స్థలాలలో మంజూరైన గృహాలను వారు పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ జావీద్ ఆలీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ గణేష్ పాల్గొన్నారు.

వైభవంగా దేవర్లు

సదుం: మండలంలోని శీలంవారిపల్లెలోని గుర్రప్ప స్వామి ఆలయంలో సోమవారం గురుదేవర్లు వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. వారిని నిర్వాహకులు సత్కరించారు. పార్టీ నాయకులు రెడ్డెప్పరెడ్డి, పుత్రాజు, కరెంటు బాబు, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకానిపల్లెలో..

సోమల: మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లె పంచాయతీ గురుకానివారిపల్లెలో గుర్రప్పస్వామి ఆలయంలో సోమవారం గ్రామస్తులు ఘనంగా పూజలు చేశారు. ఐదేళ్లకోసారి పూజలు చేయడం పరిపాటి. పూజల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, వాటర్‌షెడ్ చైర్‌పర్సన్ పుష్పావతి, పార్టీ నాయకులు బొట్టు శంకరప్ప, శంకరయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి

పుంగనూరు: పండిట్ దీన్‌దయాళ్ జయంతిని సోమవారం పట్టణంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. దీన్‌దయాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో పెద్దమఠం బాబు, మల్లికారాణి, నానబాల కుమార్, వెంకటప్రసాద్, ఆనందరాజు తదితరులు పాల్గొన్నారు.

పొలం చుట్టూ కరెంటు ఉచ్చు!

- కోర్టుకు హాజరు కాని నిందితుడి అరెస్ట్
- చిత్తూరు జైలుకు తరలింపు

సోమల: వన్యప్రాణులను చంపడానికి పొలం చుట్టూ కరెంటు తీగలు అమర్చాడనే సమాచారంతో మండలంలోని పేటూరు పంచాయతీ బోనమందకు చెందిన సుబ్రమణ్యంను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటన 2020లో చోటుచేసుకుంది. ఆ తర్వాత సుబ్రమణ్యం ఇప్పటి వరకు అతను కోర్టుకు హాజరు కాకపోవడంతో అతడిపై అరెస్ట్ వారెంట్ జారీ అయ్యింది. సోమవారం అతడిని పోలీసులు అరెస్ట్ చేసి, చిత్తూరు జిల్లా కోర్టులో హాజరు పరచారు. న్యాయమూర్తి అతడికి 8రోజుల పాటు రిమాండ్ విధించడంతో చిత్తూరు జైలుకు తరలించినట్టు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు.


చిత్తూరు జైలుకు సుబ్రమణ్యంను తరలిస్తున్న పోలీసులు

27న మినీ జాబ్‌మేళా

పలమనేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 27న ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయశేఖరం సోమవారం తెలిపారు. పదో తరగతి పాస్/ఫెయిల్ నుంచి యూజీ దాకా చదివిన వారు పాల్గొనవచ్చని చెప్పారు. 150 పోస్టులకు సంబంధించి మూడు బహుళజాతి కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులను ఎంపిక చేస్తారని, ఎంపికైన వారికి నెలకు రూ.14,400 నుంచి రూ.30,200 దాకా జీతం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఇంటర్వ్యూలకు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

మోడల్ స్కూల్ పనులు పూర్తిచేయాలి

రొంపిచెర్ల: మోడల్ స్కూల్ పనులను 15 రోజుల్లో పూర్తి చేసి అప్పగించాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సోమవారం రొంపిచెర్ల మోడల్ స్కూల్ పనులను పరిశీలించి మాట్లాడారు. తరగతి గదులకు రూ. 40 లక్షలు, హాస్టల్ భవనానికి రూ.35 లక్షలు, సీసీ రోడ్డుకు రూ.10 లక్షలు, విద్యుత్ కనెక్షన్ కోసం మరో రూ. 18 లక్షలను ప్రభుత్వం నుంచి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంజూరు చేయించారని తెలిపారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సరళ, ఎంపీడీఓ రాజేంద్ర, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు సూర్యనారాయణ రెడ్డి, కోటా వెంకటరమణ, కరుణాకర్, భాస్కర్ రెడ్డి, బాలాజి, శ్రీనాథనాయుడు, సైపుల్లాఖాన్, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు శ్మశానం, దారి సౌకర్యం

గుడుపల్లె: మండలంలోని కుప్పిగానిపల్లె ముస్లింలకు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ చొరవతో 2 ఎకరాల స్థలాన్ని శ్మశానానికి కేటాయించారు. అలాగే దారి సౌకర్యం కల్పించారు. కుప్పిగానిపల్లెలో 120 ముస్లిం కుటుంబాలున్నాయి. ఈ కుటుంబాలకు ఉన్న కబరస్థాన్ (శ్మశానం) స్థలాన్ని గతంలో హంద్రీ–నీవా కాలువ భూసేకరణ పనులకు సేకరించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం భూసర్వే చేసి శ్మశానానికి స్థలం ఇచ్చింది. సోమవారం ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, మండల కో–కన్వీనర్, స్థానిక సర్పంచ్ రామమూర్తి రెవెన్యూ అధికారుల సహకారంతో ఆ శ్మశాన స్థలానికి సిరిగిరిపల్లె గ్రామానికి వెళ్లే రోడ్డు నుంచి జేసీబీతో చదును చేసి దారి కల్పించారు. ముస్లింలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఓయన్ కొత్తూరు సర్పంచ్ దేవప్పనాయుడు, ఎంపీటీసీ వెంకటేష్, గోపి, వెంకటస్వామి, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



బదిలీ టీచర్లకు వీడ్కోలు సన్మానం



పులిచెర్ల(కల్లూరు): మండలంలోని ఎర్రపాపిరెడ్డిగారిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి బదిలీపై వెళ్లిన టీచర్లు నానికానాయక్, బి.ప్రతాప్‌రెడ్డి, ఆంజనేయులును సోమవారం ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, ఉపాధ్యాయులు సన్మానించారు. వారి సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో నాదమునిరెడ్డి,ఎంఈఓ సిద్ధరామయ్య పాల్గొన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాలు



రొంపిచెర్ల: ప్రభుత్వ సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అర్హుల దరికి చేరవేయాలని జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రొంపిచెర్ల గ్రామ పంచాయతీలో ఎంపికైన వలంటీర్లకు నియామక పత్రాలను అందచేసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్ర, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, కార్యదర్శి నాగరాజ పాల్గొన్నారు.

డీసీసీబీ మాజీ డైరెక్టర్ మృతి

చౌడేపల్లె: మండలంలోని పెద్దయల్లకుంట్ల పంచాయతీ చిప్పిలివారిపల్లెకు చెందిన డీసీసీబీ మాజీ డైరెక్టర్ రెడ్డెప్ప(45) సోమవారం మరణించారు. ఆయన గుండెపోటుకు గురైన మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో కన్నుమూశారు. 2013 సింగిల్‌విండో డైరెక్టర్ ఎన్నికల్లో గెలిచి ఆయన సేవలు అందించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డిలతోపాటు పలువురు పార్టీ నేతలు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.


రెడ్డెప్ప (ఫైల్)

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కుప్పం: మండలంలోని కృష్ణాదాసనపల్లెలో వైఎస్సార్ సీపీ కార్యకర్త వెంకటేష్(55) సోమవారం గుండెపోటుకు గురై మరణించాడు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ మృతుని అంత్యక్రియల నిమిత్తం ఎంపీటీసీ నారాయణ ప్రసాద్, పార్టీ నాయకులు రామకృష్ణ, గోవిందప్ప ద్వారా రూ.10 వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.



యథావిధిగా నడిచిన అంగన్‌వాడీ కేంద్రాలు

రొంపిచెర్ల: మండలంలో 38 అంగన్‌వాడీ కేంద్రాలు సోమవారం యథావిధిగా నడిచాయి. అంగన్‌వాడీ సమస్యల పరిష్కారం కోసం సీఐటీయు ఛలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. అయితే ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో పోలీసులు 10 మంది అంగన్‌వాడీ యూనియన్ నాయకులకు నోటీసులు జారీ చేశారు. దీంతో మండలం నుంచి ఒక్కరు కూడా విజయవాడకు కార్యక్రమానికి వెళ్లలేదు. అన్ని కేంద్రాలు పని చేశాయి.

ఇంటింటా 'జగనన్న ఆరోగ్య సురక్ష' పరీక్షలు

పలమనేరు: మున్సిపాలిటీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణ వ్యాప్తంగా వార్డుల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లారు. ఆ కుటుంబాల్లోని వారికి ఆరోగ్య పరీక్షలు చేశారు. వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల సబ్‌యూనిట్ అధికారి జయశంకర్, ఆరోగ్య సిబ్బంది సుజాత, సుభాషిణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.